క్లుప్తంగా

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు

గుర్ల: మండలంలోని భూపాలపురంలో సిమెంట్ రోడ్డు నిర్మాణపనులకు జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు శనివారం ఉదయం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ నిధులు రూ.4 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించనున్నామని తెలిపారు. సర్పంచ్ విజయకుమారి,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో పట్టణానికి చెందిన వ్యాపారులు అంధవరపు హరిప్రసాద్, గోవింద సోదరులు రూ.1.20 లక్షలతో వెయ్యి లీటర్ల సామర్థ్యం గల వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ వాటర్ ప్లాంట్‌ను ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ శనివారం ప్రారంభించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి సూర్యప్రకాష్, వైస్ చైర్మన్ సూరు కుమార్, వైశ్య ప్రముఖులు సూరు కామేష్, ఎస్.వి.జి.శ్రీనివాసరావు, మధు పాల్గొన్నారు.

గ్రంథాలయ భవనం ప్రారంభం



గ్రంథాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ కన్నమ్మ

మెరకముడిదాం: మండల కేంద్రంలో రూ.25 లక్షలతో నిర్మించిన శాఖా గ్రంథాలయ భవనాన్ని మెరకము డిదాం సర్పంచ్ బోనెల కన్నమ్మ శనివారం ప్రారంభించారు. నాయకులు తాడ్డి వేణు గోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, కె.గుర్రాజు, స్థానిక ఎంపీటీసీ బోనెల గోపి, కొమ్ము శంకరరావు, మురహరిరావు వెంకటరావు, బంటుపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడికి గురికావొద్దు



విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీరాములు, తదితరులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): పబ్లిక్ పరీక్షలనే భయం వీడి, ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని పదోతరగతి విద్యార్థులకు ప్రజాప్రతినిధులు సూచించా రు. గరివిడి మండలంలోని కాపుశంబాం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం శనివారం నిర్వహించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు లెంక శ్రీరాములు, తదితరులు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలతో సందడి చేశారు. అనంతరం విద్యార్థులకు పరీక్షల సామగ్రిని సర్పంచ్ లెంక సుశీలమ్మ, ఎంపీటీసీ టి.సంజీవరావు,ఉప సర్పంచ్ చందక గౌరి, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఆర్.శ్రీనివాసరావు, హెచ్ఎం.డి.రాము అందజేశారు.

రామాలయ నిర్మాణానికి ఆర్థిక సాయం

లక్కవరపుకోట: జమ్మాదేవిపేటలో రామాలయ నిర్మాణానికి మల్లివీడు గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త బోను సన్యాసిరావు రూ.50వేల ఆర్థిక సహాయం చేశారు. నగదును ఆయన సోదరుడు మాజీ సర్పంచ్ బోను పవన్‌కుమార్ గ్రామ పెద్దలకు శనివారం అందజేశారు. జమ్మాదేవిపేట గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు సంతోషకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచే కనకమహాలక్ష్మి జాతర

- తెల్లవారు జామున 2 గంటల నుంచి దర్శనాలు ప్రారంభం
- పూల అలంకరణతో ముస్తాబైన దేవస్థానం
- 800 మందితో భారీ పోలీసు బందోబస్తు





పూల అలంకరణలో అమ్మవారి దేవస్థానం(ఇన్‌సెట్లో) కనకమహాలక్ష్మి అమ్మవారు

చీపురుపల్లి: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు చీపురుపల్లి కనకమహాలక్ష్మి అమ్మవారి 26వ జాతరకు సర్వం సిద్ధమయ్యింది. ఆదివారం నుంచి మూడు రోజుల పాటు జాతర నిర్వహించనున్నారు. అమ్మవారి ఆలయం పూల అలంకరణ, విద్యుద్దీపాల కాంతులతో ముస్తాబయ్యింది. ఆదివారం తెల్లవారు జామున 2 గంటల నుంచే దర్శనాలకు దేవదాయ శాఖ, ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి సూర్య ప్రకాష్ (గోవిం ద), వైస్ చైర్మన్ సూరు కుమార్ దంపతులు అమ్మవారికి తొలిపూజ చేయనున్నారు. తొలిరోజు అమ్మవారిని లక్షమందికిపైగా భక్తులు దర్శించుకుంటారని దేవదాయశాఖ అధికారులు చెబుతున్నారు. రూ.100, రూ.50, రూ.20 దర్శనం టిక్కెట్లతో పాటు ఉచిత దర్శనానికి కూడా ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వ ర్యంలో ఎలాంటి వీఐపీ పాసులు జారీ చేయలేదు. మూడురోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వ హణకు పెద్దవేదిక సిద్ధం చేశారు. మూడురోజులు జాతరలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో పాటు జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు, వీఐపీలు అమ్మవారిని దర్శించు కోనున్నారు.



దేవస్థానం వద్ద క్యూలైన్లను పరిశీలించి సూచనలు చేస్తున్న డీఎస్పీ చక్రవర్తి

ఏర్పాట్ల పర్యవేక్షణ

అమ్మవారి జాతర ఏర్పాట్లను డీఎస్పీ ఏ.ఎస్.చక్రవర్తి శనివారం పర్యవేక్షించారు. దేవదాయశాఖ అధికారులు, ఆలయ కమిటీకి పలు సూచనలు చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా మూ డు రోజుల పాటు 800 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ముగ్గురు డీఎస్పీలు, 8మంది సీఐలు, 42 మంది ఎస్‌ఐలు బందోబస్తును పర్యవేక్షిస్తారని తెలిపారు. పాత కోర్టు ప్రాంగణం, పంచాయతీ కార్యాలయం, బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో వాహనాల పార్కింగ్ స్థలాలు కేటాయించినట్లు వివరించారు. భక్తుల రద్దీ దృష్ట్యా వాహనాల నిలుపుదల, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ ఉంటుందని స్పష్టం చేశారు. శ్రీకాకుళం వైపు నుంచి వచ్చే వాహనాలు నాగంపేట జంక్షన్ వద్ద నుంచి తోటపల్లి కాలువ గట్టు మీదుగా రావివలస జంక్షన్‌కు చేరుకోవాలని, చీపురుపల్లి నుంచి శ్రీకాకుళం వైపు వెళ్లే వాహనాలు రావివలస జంక్షన్ నుంచి తోటపల్లి కాలువ గట్టు మీదుగా నాగంపేట జంక్షన్‌కు చేరుకోవాలన్నారు. ఎవరైనా మద్యం తాగి జాతరలో భక్తులకు ఇబ్బంది కలిగించినా, అల్లర్లు సృష్టించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జాతరలో బ్రీత్ ఎన లైజర్లతో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలిగించినా కేసులు నమోదు చేస్తామని చెప్పారు. అ లాంటి వారిని గుర్తించేందుకు రెండు క్రైమ్ పార్టీలు నియమించామని చెప్పారు. అమ్మవారి దేవస్థానం వద్ద 13 సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. సీఐ సీహెచ్.షణ్ముఖరావు, ఎస్‌ఐ కె. కిరణ్‌కుమార్‌నాయుడు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి సూర్యప్రకాష్, వైస్ చైర్మన్ సూరు కుమార్, కింతలి మధు, దేవస్థానం ఈఓ జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

లోక్‌అదాలత్ ద్వారా సత్వర న్యాయం



చీపురుపల్లి: లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తి విజయరామేశ్వరి



శృంగవరపుకోట: కేసులను పరిష్కరిస్తున్న జడ్జి వాణి

చీపురుపల్లి: లోక్‌అదాలత్‌లో కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకుంటే ఇరువర్గాలకు సత్వర న్యాయం లభిస్తుందని స్థానిక మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎం.విజయరామేశ్వరి అన్నారు. స్థానిక కోర్టు హాల్‌లో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. సివిల్, క్రిమినల్ తదితర 34 కేసులను రాజీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేసులు, తగాదాలతో విలువైన సమయాన్ని, డబ్బును వృథా చేసుకోవద్దని చెప్పారు. ఇరువర్గాలు ఆలోచన చేసి రాజీ కుదుర్చుకోవాలన్నారు. లోక్‌అదాలత్ మెంబర్ భోగాపురపు శ్రీదేవి, న్యాయవాది జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

50 కేసులు పరిష్కారం

శృంగవరపుకోట: స్థానిక మున్సిఫ్ కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 50 కేసులు పరిష్కరించామని మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్ సబ్బవరపు వాణి చెప్పారు. న్యాయమూర్తి వాణి నేతృత్వంలో పెండింగ్‌లో ఉన్న 13 సివిల్, 10 చెక్‌బౌన్స్, 2 మనోవర్తి, కేసులతో పాటు 25 వేర్వేరు కేసులను పరిష్కరించారు. పలువురు న్యాయవాదులు, రెవె న్యూ, పోలీస్, బ్యాంకింగ్ అధికారులు, కక్షిదారులు హాజరయ్యారు.

రైతు బజారు నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ తవుడు, ఎంపీపీ జ్ఞానదీపిక

గజపతినగరం: మండల కేంద్రంలో రూ.18 లక్షలతో రైతుబజారు నిర్మాణానికి జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక శని వారం ఉదయం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాబార్డ్ నిధులు రూ.15లక్షలు, గ్రామ పంచాయతీ నిధులు రూ.3 లక్షలతో 40 దుకాణాల కోసం షెడ్ల నిర్మాణంతో పాటు ఇతర సదుపాయాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక సర్పంచ్ నరవ కొండమ్మ, వైస్ సర్పంచ్ కర్రి రామునాయుడు, ఎంపీడీఓ పి.జయంత్‌ప్రసాద్, వైస్ ఎంపీపీ కర్రి శ్రీదేవి, పీఏసీఎస్ అధ్యక్షుడు కె.ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు కర్రి నానాజీ, బోడసింగి వాసు, బి.కృష్ణ, శ్రీను, పంచాయతీ కార్యదర్శి రమణ తదితరులు పాల్గొన్నారు.

తారురోడ్ల నిర్మాణానికి భూమి పూజ



గదబవలస వద్ద బీటీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు,నాయకులు

దత్తిరాజేరు: మండలంలోని గదబవలస, పి లింగాలవలస గ్రామాలకు తారురోడ్ల నిర్మాణానికి ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి శనివారం ఉదయం భూమి పూజ చేశారు. పంచాయతీ రాజ్ రూరల్ డవలప్ మెంట్ నిధులు రూ. 2.20 కోట్లతో గదబవలస నుంచి చిన చామలాపల్లి మీదుగా ఇంగిలాపల్లి వరకు 4 కిలో మీటర్ల మేర, అలాగే పి.లింగాలవలస నుంచి బాడంగి మండలం వీరసాగరం వరకు 2.5 కిలోమీటర్ల మేర బీటీ రోడ్లను నిర్మించ నున్నారు. సర్పంచ్‌లు మజ్జి భారతి, కొత్తలి మంగమ్మ, ఏఎంసీ డైరెక్టర్ లెంక సత్తిబాబు, వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, ఏఎంసీ ఉపాధ్యక్షు డు మండల శ్రీను, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మిని దర్శించుకున్న ఎంపీ 'బెల్లాన'



అమ్మవారిని దర్శించుకుని వస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారిని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ శనివారం దర్శించుకున్నారు. త్వరలో జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో విజయనగరం పార్లమెంటు వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఆయన పేరును ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి శనివారం ఇడుపులపాయలో ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఎంపీ చంద్రశేఖర్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

తాగునీటి సమస్యలకు చెక్



దొగ్గపేటలో పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ సత్యవంతుడు, సర్పంచ్ అరుణ

వేపాడ: మండలంలోని కుమ్మపల్లి పంచాయతీలో తాగునీటి సమస్యలకు చెక్ పడనుంది. తాగునీటి కుళాయిలు, పంపుసెట్ల ఏర్పాటు, బోర్ల తవ్వకాల పనులకు ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, సర్పంచ్ నొడు అరుణ శనివారం ఉదయం భూమిపూజ చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దేవి మాట్లాడుతూ జల జీవన్ మిషన్ పథకం నిధులు రూ.8 లక్షలతో కుమ్మపల్లిలో ఇంటింట కుళాయిల ఏర్పాటు, మండల పరిషత్ నిధులు రూ.8లక్షలతో దొగ్గపేటలో బోరు తవ్వకాలు, ఇంటింట కుళాయిల ఏర్పాటు పనులు చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే బొడ్డు,దొగ్గ వారి కళ్లాల్లో పంచాయతీ నిధులతో బోర్లు వేయించ నున్నామని తెలిపారు. స్థానిక నాయకులు నొడు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

గంట్యాడ: గర్భిణులు, బాలింతలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ పీఓ డోకుల ఉమాభారతి సూచించారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా బోనంగి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు మంచి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే పుట్టే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. మునగాకును ఆహారంగా తీసుకుంటే రక్తహీనత సమస్య ఉండదని చెప్పారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రం ద్వారా సరఫరా చేస్తున్న ఫోర్టిఫైడ్ రైస్, రాగి పిండి, అటుకులు, ఖర్జూరం, చెక్కీలు తినడం వల్ల రక్తం వృద్ధి చెంది ఆరోగ్యకరంగా ఉంటా రని తెలిపారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ పద్మ పాల్గొన్నారు.

ఘనంగా యల్లారమ్మ తొలేళ్ల సంబరం



వైష్ణవీ మాతగా భక్తులకు దర్శనమిస్తున్న యల్లారమ్మ



ప్రభలతో అమ్మవారి దర్శనానికి వెళుతున్న భక్తులు

జామి: ఉత్తరాంధ్రలో ప్రసిద్ధిగాంచిన జామి యల్లారమ్మ జాతర శనివారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు నిర్వహించే జాతరలో తొలిరోజు శనివారం అమ్మవారి తొలేళ్ల జాతర ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. భక్తులు అమ్మవారికి చీరలు, గాజులు, పసుపు, కుంకుమ సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా మొదటి రోజు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. వైష్ణవీ మాత అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. దేవాలయ ప్రాంగణాన్ని పూలమాలలతో అలంకరించారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. సీసీ కెమెరాలతో నిఘా, గట్టి పోలీ స్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



అమ్మవారిని గద్దె నుంచి ఆలయానికి తీసుకువెళుతున్న ఉత్సవ కమిటీ సభ్యులు



తొలేళ్ల ఉత్సవంలో మహిళలు, చిన్నారుల కోలాటం

వైఎస్సార్‌సీపీ శ్రేణుల సంబరాలు



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, తదితరులు

శృంగవరపుకోట: ఎస్.కోట అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యేగా కడుబండి శ్రీనివాసరావు పేరును పార్టీ అధిష్టానం శని వారం ప్రకటించడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఎస్.కోటలో సంబరాలు చేశారు. స్థానిక క్యాంప్ ఆఫీస్‌కి వచ్చిన ఎమ్మెల్యే కడుబండిని వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేతో పాటు స్థానిక నాయకులు దేవీ జంక్షన్‌లో బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నా. దివంగత ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా 50శాతం సీట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించిన నాయకుడు జగన్ అని అన్నారు. అత్యధికంగా మహిళలకు సీట్లు ఇచ్చి రాజకీయాల్లో మహిళలకు సింహభాగం కేటాయించారని, అంబేడ్కర్ స్ఫూర్తిని అక్షరాలా అమలు చేసిన నిజమైన రాజకీయ నేత జగన్ అని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఎస్.కోట మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, నాయకులు వి.రాంబాబు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అమరజీవికి ఘనంగా నివాళులు



కొత్తవలస: పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు



చీపురుపల్లిరూరల్(గరివిడి):పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

కొత్తవలస: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయ ఆవరణలోని పొట్టిశ్రీరాములు విగ్రహానికి మండల ఆర్యవైశ్య సంఘం సభ్యులతో కలిసి తహసీల్దార్ చంద్రశేఖర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధనకు తన ప్రాణాలు త్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములని, ఆయన జీవితం భావితరాలవారికి ఆదర్శప్రాయమన్నారు. ఆర్యవైశ్య సంఘం సభ్యులు కుంకాల పండు, పూసర్ల నాని, మూర్కురి నాని, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గరివిడిలో..

చీపురుపల్లిరూరల్(గరివిడి): ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములను స్మరించుకోవాలని పలువురు వక్తలు అన్నారు. పొట్టిశ్రీరాములు జయంతిని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గరివిడి ఆర్‌ఓబీ కింద ఉన్న ఆయన విగ్రహానికి ఆర్య వైశ్యసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వి.వి.ఎస్.ఎస్.ఎన్.గుప్త ఆధ్వర్యంలో సంఘ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళుర్పించారు.

నీకా.. నాకా..!

- టీడీపీలో ఇరువర్గాల్లో తీవ్ర ఉత్కంఠ
- టికెట్ మాదేనంటూ గొంప, కోళ్లవర్గాలు వేర్వేరుగా ప్రచారం
- అయోమయంలో పార్టీ కేడర్



శృంగవరపుకోట: ఎన్నికల కోడ్ వచ్చినా ఎస్.కోట తెలుగుదేశం పార్టీకి తెల్లారలేదు. ఆర్నెళ్లుగా రగులుతున్న కుంపట్లు చల్లారనేలేదు. ఏ పార్టీలో అయినా అధినాయకత్వం స్థానిక నాయకుల్లో వర్గపోరును చల్లార్చి శ్రేణులను ఒక్కటిగా చేయడం సాధారణం. టీడీపీ మాత్రం అందుకు భిన్నం. పొమ్మన లేక పొగబెట్టిన తీరుగా ఎస్.కోట టీడీపీలో వర్గపోరుకు అధిష్టానమే తెరతీసింది. దశాబ్దాల తరబడి పార్టీకోసం పనిచేస్తూ.. నియోజకవర్గ బాధ్యతలు నిర్వహిస్తున్న కోళ్ల లలిత కుమారిని కాదని ఆమెకు పోటీగా డబ్బు ఖర్చుచేస్తారనే ఆశతో ఎన్ఆర్ఐ గొంప కృష్ణను తెరమీదికి తెచ్చింది. అప్పటి నుంచి నియోజకవర్గంలో పార్టీ రెండుగా చీలిపోయింది. ఎవరికి వారే యమునా తీరే అన్నచందంగా ఉంది. దీంతో ఉన్నపాటి కొద్దిపాటి శ్రేణులు చెల్లా చెదురయ్యాయి. ఇప్పుడు అభ్యర్థులు తమ ఆర్థిక బలాన్ని నిరూపించుకునే పనిలో ఉన్నట్టు బోగట్టా. పలు సందర్భాల్లో రెండు వర్గాలు బాహాబాహీకి దిగాయి. టికెట్ ఎవరికిచ్చినా రెండో వర్గం మద్దతు ఇచ్చే అవకాశమే లేదన్నంతగా దూరం పెరిగింది. ఇద్దరు అభ్యర్థులను వాడేయడం.. అవసరం తీరాక అందులో ఒకరిని గెంటేయడం చంద్రబాబుకు అలవాటైన రాజకీయమేనన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ నెల 18వ తేదీన టీడీపీ అభ్యర్థుల పేర్లు వెల్లడిస్తామని చెప్పడంతో ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు.

ఎవరిమాట నెగ్గుతుందో?

చినబాబు (లోకేశ్) ఒకరికి, పెదబాబు (చంద్రబాబు) ఒకరికి కొమ్ముకాస్తూ ఇద్దరిలోనూ టికెట్ ఆశలు రేకెత్తిస్తున్నారు. అయితే, ఇక్కడ మాత్రం ఎవరికి టికెట్ వచ్చినా రెండో వర్గం మద్దతు ఇచ్చే అవకాశం లేదు. తాత్కాలికంగా ఒక్కటిగా కలిసినా కడుపులో కత్తులు దించేయడం ఖాయం అని పార్టీ అభిమానులే చెబుతున్నారు. మరోవైపు ప్రస్తుత సిటింగ్ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఇప్పటికే జోరుగా ప్రచారం చేస్తుండడం, విజయ ధీమాతో ముందుకు సాగుతుండడంతో టీడీపీ అభ్యర్థులను కలవరపెడుతోంది. ఓడిపోయినా కనీసం టికెట్ ఇస్తే పరువు నిలుస్తుందన్న భావనలో టీడీపీ అభ్యర్థులు ప్రయత్నాలు చేయడం గమనార్హం.